
# బామ్మగారి యాజ్ఞీకం

ఆర్.ఎస్.హైమవతి



"శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం..."

"ఒసేయ్ మీనాక్షీ! పొయ్యిమీద ఎసరుపెట్టాను. దాంట్లో బియ్యం పొయ్యి.."

"ఆ! శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం"

"ఒసేయ్! సావిత్రీ! గంధం తీశావా?"

"శుక్లాం బరధరం విష్ణుం"

"ఒసేయ్! పార్వతీ వస్త్రాలు, యజ్ఞోపవీతాలు చేశావా?"

"శుక్లాం బరధరం...."

"అక్షింతలు కలిపారో లేదో? అన్నీ నేను చెప్పాలి. ఒక్కటీ పద్ధతిగా చెయ్యాలని తెలియదు, మా రోజుల్లో..." అంటూ సగం పూజ చేయిస్తూ మాటి మాటికీ కోడళ్ళని అది చేశారా? ఇది చేశారా? అంటూ అడుగుతూ మెల్లిగా విసుక్కునే స్థితికి వచ్చి, ఆవిడ తన అత్తగారి దగ్గిర ఎంత భయభక్తులతో పన్లు చేసేదో వివరించి ఈ కాలం వాళ్ళకి ఎంత బద్ధకాలో... ఎంతమాత్రం పనిచేతకాదో, వగైరా వగైరా ఉపన్యాసాన్ని గంగమ్మగారు అందుకోక ముందే ఆ ప్రవాహానికి ఆవిడ కొడుకు శంకర్రావు అడ్డు కట్ట వేశాడు.

"మీ కోడళ్ళు ఇక్కడ అన్నీ అమర్చారు గాని నువ్వు పూజ చేయించు అమ్మా!" అన్నాడు.

"ఆ! చేయిస్తానురా! అన్నీ ఉన్నాయో లేదో చూసుకోవద్దూ! ఆ! ఆచమనం చెయ్యండి. జిం భూః..... మమ, ఉపాత్త...ర్థం. శుభే! శోభన ముహూర్తే! ఒసేయ్! మీనాక్షీ! అన్నం ఉడికిపోయి వుంటుంది. వార్చేసెయ్! ఆ! ఏమర్రా! ముక్కుపట్టుకున్నారా? అది కూడా చెప్పి చావాలి. అసలు బొత్తిగా పూజ, పునస్కారం ఏమన్నా తెలిసేడిస్తేగా? మాకాలంలో అయితే..."

"అబ్బా! అమ్మా! ఆపు. మేమేకాదు. మా పిల్లలు కూడా ముక్కు పట్టుక్కూర్చున్నారు. తుమ్మొచ్చి చేతిలో చీమిడిపడి ఏం చెయ్యాలో తెలియక అవస్థ పడుతున్నాడు రాముగాడు, ఇంక చెయ్యి తీసెయ్యొచ్చా? చెప్పు" అన్నాడు ముక్కు మీద చెయ్యి ఉంచుకునే ఆవిడ చిన్నకొడుకు మధు.

"ఆ! తీసెయ్యచ్చు. ఒసేయ్ సావిత్రీ! నీ కొడుకు చేతిలో ముక్కు చీదాడుట. ఓ చెంబుతో నీళ్ళు పట్టుకురా! వాడు అందులో చెయ్యి కడుక్కుంటాడు. తీసుకెళ్ళి బైట పోసెయ్! లేకపోతే వాడు ఆ చేత్తోనే పూజ చెయ్యగలడు వినాయకుడికి. ఏం పిల్లలో? ఏం కాలమో?"

"అమ్మా! ఇంక ఆపి పూజకానియ్!" ఆవిడ మూడవ కొడుకు వాసు హెచ్చరించాడు ఆవిడ ధోరణి పసిగట్టి.

"అబ్బ! కానిస్తున్నానురా! మరి, వినాయకుడి పెళ్ళికి వేయి విఘ్నాలన్నట్లు నా యాజ్ఞీకానికి కూడా అన్నీ విఘ్నాలే! ఆ! ఎంతవరకూ చేయించాను?

"శోభన ముహూర్తే!" ఆవిడ పెద్ద మనవడు అందిచ్చాడు.

"ఆ! ఆద్యబ్రహ్మణః! ద్వితీయ పరార్థే! శ్వేత వరాహకల్పే! వైవస్వత మన్వంతరే! కలియుగే! ప్రథమపాదే! జంబూద్వీపే! అన్నట్లు జంబూద్వీపే అంటే గుర్తుకొచ్చింది. జంబూఫలం తెచ్చారా?" అంది గంగమ్మగారు.

"జంబూ ఫలం అంటే ఏమిటి బామ్మా?" అంది ఆవిడ పెద్ద మనవరాలు వసుంధర.

"అది కూడా తెలియదుటే! ఏం చదువులు చదువుతున్నారో? బొత్తిగా ప్రపంచజ్ఞానం లేకుండా పోతుంది. జంబూఫలం అంటే నేరేడుపళ్ళు. ఇంతకీ తెచ్చారా? లేదా?"

"అంటే నల్లగా ఉంటాయి. అవే కదా? అవిగో పళ్ళెంలో ఉన్నాయి" అన్నాడు రాము.

"ఆ! ఎంతవరకూ వచ్చిందర్రా?" అడిగింది

గంగమ్మగారు.

"జంబూద్వీపం వరకూ వచ్చింది బామ్మా!" అంది ఇంకో మనవరాలు లక్ష్మి.

"ఆ! వచ్చిందా? భరతవర్షే! భరతఖండే! మేరోః దక్షిణ దిగ్భాగే! శ్రీశైలస్య వాయువ్య ప్రదేశే! కృష్ణా, గోదావర్యోః మధ్యప్రదేశే!......... దక్షిణాయనే, వర్షఋతౌ, ఏం వర్షఋతువో ఒక్క వాన చుక్క పట్టం లేదు. పూర్వం విఘ్నేశ్వర చవితికి వీధులమ్మట నీళ్ళొస్తాయని అనేవారు, అలాగే వచ్చేవి. ఏమిటో? కలికాలం! వ్యాసులవారు కలికాలం గురించి ఆ రోజుల్లోనే చెప్పారు..."

"అబ్బా! అమ్మా! ఆపు, పూజ చేయించు" మళ్ళీ వాసు హెచ్చరిక విని బామ్మగారు "అబ్బ! వీడికెప్పుడూ హడావిడే!" అంది. "హడావిడి కాదు బామ్మా! మనం అలా మెల్లిగా పూజ చేశామనుకో! పాపం వినాయకుడికి ఆకలేసి మనం ఎప్పటికీ నైవేద్యం పెట్టడం లేదని మరో ఇంటికి వెళ్ళిపోతాడు." అన్నాడు ముందుచూపుతో రాము.

"ఆ! నిజమేనర్రా! ప్రాణప్రతిష్ట చేసి చాలాసేపైందిగా! అంతసేపు నైవేద్యం పెట్టకుండా ఉండకూడదు. అందుకే గమ్మున అదిగో ఆ చలిమిడి ఉండ్రాళ్ళు ముందర అవసర నైవేద్యం పెట్టేయండి, పూజ కథ అయ్యాక ఉండ్రాళ్ళు పిండివంటలు అవీ పెట్టచ్చు" అంది బామ్మగారు.

"అయితే బామ్మా! అవసర నైవేద్యం దేముడికేనా మాకు లేదా? మాకూ ఆకలేస్తోంది బామ్మా!" అంటూ జాలిగా అడిగాడు ఆఖరి మనవడు కృష్ణ, వాడంటే ఆవిడకి వల్లమాలిన ప్రేమ. అందుకు కారణం వాడు అందరు మనవల్లోకి చిన్నవాడు. పైగా ఆవిడ మగని పేరింటిగాడు, అందుకే వాడు ఆకలి అనగానే కరిగిపోయి...

"దేముడికి పూజ చేసుకోకుండా ఏమీ తినకూడదు నాన్నా! పోనీ ఒక్క అరిటిపండు తిను. పరవాలేదులే!" అంటూ భరోసా ఇచ్చింది గంగమ్మగారు. అంతే! అందరూ తలో అరిటిపండు తినేశారు గబగబా.

"అయ్యయ్యో! మీరందరూ తినేస్తారేమిటర్రా! ఆఖరికి అరిటిపళ్ళు వినాయకుడికి ఉన్నాయో? లేవో?" అంటూ లబోదిబో మొత్తుకుంది బామ్మగారు.

"పరవాలేదు బామ్మా! వినాయకుడికి ఒక అరిటిపండు ఉంచాలే! ఎక్కువ తింటే ఆయనకి కూడా నీలా షుగరొస్తుంది" అంది వసుంధర.

"తప్పుకాదుటే! దేముళ్ళని అలా అంటే కళ్ళు పోతాయి, రోగాలన్నీ మనకేగాని, దేముళ్ళకి రావు" అంది బామ్మగారు.

"ఉత్తినే అన్నాలే బామ్మా! దేముడేం అనుకోడు. దేముడు మన ఫ్రెండేగా!" అంది వసుంధర.

"రామాయణంలో పిడకల వేటలా సుత్తి కబుర్లాపేసి ఇంక పూజ మొదలెట్టండి" అన్నాడు శంకర్రావు గంభీరంగా.

"ఆ! అధైక వింశతి పత్రపూజా! సుముఖాయన మహః! మచీపత్రం పూజయామి, గణాధిపాయ నమః బృహతీపత్రం పూజయామి! ఉమాపుత్రాయనమః బిల్వ పత్రం పూజయామి! గజాననాయనమః! దుర్వారయుగ్మం పూజయామి..." అంటూ చదువుకుపోతున్న బామ్మకి వినపడకుండా తండ్రి చెవిలో మెల్లిగా అన్నాడు రాము.

"ఏ పత్రం ఏదో నీకు తెలుసా? నాన్నా! ఏది చదివితే అదే పూజ చెయ్యాలా?" అంటూ.

"అదేం లేదురా! అసలు ఆ పత్రాలన్నీ మామ్మకే తెలుసో, తెలియదో? బజారులో ఇచ్చిన ఆకులేవో పూజ చేసెయ్! లేకపోతే మనకివాళ పూజ పూర్తికాదు. కడుపులోకి తిండి రాదు" అన్నాడు మెల్లిగా మధు.

"ఏమిటర్రా? ఆ గుసగుసలు? పత్రి పూజ చేస్తున్నారా? లేదా? ఈ రోజుల్లో మనకి అన్ని పత్రాలూ ఎటూ దొరకవు, బజార్లో దొరికేవి బిల్వ దళాలు, తులసిదళాలు, దూర్వాలూను, అవే చెయ్యండి. అన్నట్లు దూర్వాలు కాసిని విడిగా ఉంచుకోండి. దూర్వాయుగ్మం పూజ వేరే వస్తుంది" అంది గంగమ్మగారు.

"అసలు దూర్వాలు అంటే ఏమిటి బామ్మా?" అంది లక్ష్మి.

"దూర్వాలు అంటే గడ్డి పరకలర్రా! గడ్డి అని అనకూడదు. దేముడికి పూజ చేసే వాటిని దూర్వాలు అనాలి" అంది బామ్మ.

"పన్నెండయిపోయింది. త్వరగా పూజ, కథ అన్నీ ముగించండి. ఇవాళ భోజనం అయ్యేసరికీ రెండో, మూడో అవడం ఖాయం" అన్నాడు వాసు.


"వీడికెప్పుడూ తిండి గొడవే! దేముడూ, భయం, భక్తి అసలు లేవు" అంది గంగమ్మగారు.

"దేముడు నువ్వు చెప్పే ఇన్‌స్టాల్‌మెంట్ యాజ్ఞీకానికి విసుగెత్తి ఎప్పుడో కైలాసానికి వెళ్ళిపోయి ఉంటాడు. ఇప్పటికైనా ఈ సీరియల్ పూజ ముగించేస్తే కనీసం మనమైనా ఉండ్రాళ్ళు గట్రా తినొచ్చు" అన్నాడు మళ్ళీ వాసు.

బామ్మగారు మళ్ళీ పూజ మొదలెట్టి మధ్యలో మళ్ళీ మళ్ళీ బ్రేక్‌లతో పూజ ముగించేసరికీ ఒంటిగంట పైనే అయింది. తరువాత కథ, హారతి, నైవేద్యం అన్నీ ముగించి భోజనాలు అయ్యేసరికీ మూడు గంటలయింది.

గంగమ్మగారికి వినాయకచవితికి కొడుకులు, మనవలు ఒకచోట పూజ చేసుకోవాలని కోరిక. ఆవిడ కోరికని కాదనలేక ప్రతీ సంవత్సరం కొడుకులు, కోడళ్ళు, మనవలు అంతా వచ్చి ఆవిడ ఇంట్లోనే పూజ చేసుకుంటారు. బ్రాహ్మడిని పిలిస్తే మాటలు మింగేసి, దాంటించేసి పూజ సరిగ్గా చేయించడని ఆవిడ అభిప్రాయం. కొడుకులు, కోడళ్ళు, మనవలు అందరిచేత తను పూజ చేయించాలని ఆవిడ ఆశ, కోరిక. అందుకే పెద్దావిడ మాట కాదనలేక అంతా ఆవిడ చెప్పినట్లే చేసి ఆఖర్న అందరూ ఆవిడకి నమస్కారం చేసి ఆశీసులు పొందుతారు. అది వారి అలవాటు.

❋



## మాతృప్రేమ!

నటుడిగా రావుగోపాలరావు ఒక ట్రెండ్‌సెట్టర్ అని చెప్పొచ్చు. అప్పటికే పేరు ప్రతిష్ఠలు సంపాదించిన యస్వీఆర్‌ని డామినేట్ చేయడమంటే మాటలా? అందుకే రావుగోపాలరావు మాడ్యులేషన్‌లో ఓ ప్రత్యేకత సంతరించుకొని సక్సెస్ అయ్యాడు. అయితే కొనవూపిరితో వున్నంతకాలం రంగస్థలం విడిచిపెట్టి వుండలేదు. రంగస్థలం అంటే తల్లితో సమానం అనేవాడు. ఇపుడెంత మందున్నారు రంగస్థలాన్ని మాతృసమానంగా చూసేవాళ్ళు?